కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ చేతన్

విద్యార్థుల సమగ్రవికాసానికి తోడ్పాటు

- నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- కలెక్టర్ టి.ఎస్.చేతన్
- నాసిన్ ప్రాంగణంలో కేంద్రీయ విద్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-గోరంట్ల

విద్యార్థుల సమగ్ర వికాసానికి నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని కలెక్టర్ టిఎస్.చేతన్ పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండల పరిధిలోని పాలసముద్రం సమీపంలో ఉన్న మాదకద్రవ్యాలు, కస్టమ్స్, పరోక్ష పన్నుల జాతీయ అకాడమీ(నాసిన్) ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కేంద్రీయ విద్యాలయం 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 2025 -26 విద్యా సంవత్సరానికి తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందుకోసం కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటు చేసిందన్నారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీ మాధ్యమ విద్యార్థులకు మౌలిక సదుపాయాలను అందించడం ద్వారా భాషాపరంగా, అభ్యాసపరంగా వారిని సమానంగా తీర్చిదిద్దే ప్రయత్నం కొనసాగుతోందన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి, వారి శారీరక, మానసిక అభివద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవడంలో సమాజం మొత్తం భాగస్వామిగా ఉండాలని కలెక్టర్ సూచించారు. గతంలో జాతీయ రహదారి పక్కన కేంద్రీయ విద్యాలయానికి భూమి కేటాయించామని విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నాసిన్ వెనుక వైపు భూమిని కేటాయించి ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేశామన్నారు. హైవే పక్కన పాఠశాల ఉన్న నేపథ్యంలో విద్యార్థుల భద్రతకు అన్ని చర్యలూ తీసుకోవాలని ఆదేశించారు. విద్యతో పాటు పిల్లలకు ఇష్టమైన క్రీడలలో రాణించడానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాసిన్ జాయింట్ డైరెక్టర్ డి.సత్యదివ్య రమ్య, డిప్యూటీ డైరెక్టర్ ఈ.శేషు, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ బి.కృష్ణారావు, గోరంట్ల తహశీల్దార్ మారుతి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అనంతపురం నగరం చుట్టు పక్కల భూ యజమానుల్లో కంటి కునుకులేకుండాపోతోంది. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కొంత మంది కబ్జాకు కర్చీఫ్ వేసేస్తున్నారు. ఈ భూమి తమదేనంటు ఖాళీ స్థలంలో వాలిపోతున్నారు. పదుల సంఖ్యలో జనం గుమికూడి జెసిబిలతో చదును చేసే కార్యక్రమాలు చేపడుతున్నారు. దీంతో తమ అన్ని రకాల పత్రాలున్నాయి... తమదే భూమి అని భావిస్తూ వచ్చిన భూ యజమానులకు కంటిమీద కునుకులేకుండాపోతోంది. అధికార బలంతో కొంత మంది నేతలు ఈ రకమైన దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు పెద్దఎత్తున వెల్లువెత్తుతున్నాయి. వరుసగా వెలుగులోకి వస్తున్న ఘటనలు సర్వత్రా ఆందోళనకు గురిచేస్తున్నాయి.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

భూ గుబులు..!

- ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా
- బెంబేలెత్తిపోతున్న భూ యజమానులు
- వెంచరేసినా కప్పం కట్టాల్సిందే..

అధికార పార్టీ నేతల భూములకే ఎసరు

అనంతపురం నగర శివారులోని ఎంకెఎం ఫంక్షన్ హాలు సమీపంలో సర్వేనంబరు 209, 210లో అధికార పార్టీకి చెందిన నాయకులే గతకొన్నేళ్ల క్రితం కొనుగోలు చేశారు. ఈ స్థలంపై కొంత మంది అధికారపార్టీ నేతల కన్నుపడింది. ఆ భూమి తమదేనంటూ కబ్జాకు దిగినట్టు ఇటీవలనే పెద్దఎత్తున చర్చ జరిగింది. దీనిపై సదరు అధికారపార్టీ నేతలుగానున్న భూ యజమానులు తమ భూమినే కబ్జా చేస్తున్నారంటూ ఏకంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు ఉత్తరం రాసి తమ సమస్యను మొరపెట్టుకున్నారు. ఇది పెద్దఎత్తున మీడియాలోనూ చర్చ జరిగింది. దీనిపై తదుపరి చర్యలు ఏ విధంగా ఉండనున్నాయన్నది చూడాల్సి ఉంది.

దాడి చేసి కబ్జా

అనంతపురం నగరంలోని కక్కలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో 242 సర్వే నంబరులో మూడున్నర ఎకరాల భూమి ఉంది. స్థలం ఖాళీగా కనిపించడంతో వివాదముందంటూ అధికారపార్టీకి చెందిన కొందరు నేతలు రంగంలోకి దిగారు. అడ్డుకోబోయిన భూ యజమానులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దీనిపైనా బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఎన్నో ఏళ్లుగా తమ పరిధిలోనున్న భూమిని రాత్రికిరాత్రి కొంత మంది వచ్చి తమదంటూ దౌర్జన్యానికి దిగారంటూ బాధితులు అప్పట్లో ఆవేదన వ్యక్తం చేశారు.

మరో చోట అదే తీరు

అనంతపురం నగరం పరిధి కక్కలపల్లి సర్వే నంబరు 144లో 1.76 ఎకరాల భూమిని కొంత మంది వ్యక్తులు ప్లాట్లుగా కొనుగోలు చేశారు. సర్వే సమయంలో జరిగిన చిన్న పొరపాటును అడ్డుపెట్టుకుని కొంత మంది అధికారపార్టీ నేతలు రంగంలోకి దిగి ఆక్రమించే ప్రయత్నం చేశారు. దీనిపైనా బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

వెంచరేసినా కప్పం కట్టాల్సిందే

అనంతపురం శివారుల్లో ఎవరైనా వెంచరేసినా అధికారపార్టీ నేతలు రంగంలోకి దిగిపోతున్నారు. ఆ వెంచరేసేది అధికార పార్టీ నాయకులైనా సరే ముఖ్య నేతలకు కప్పం కట్టాల్సిందే. వెంచర్ విలువను బట్టి డబ్బులు చెల్లించాలి. లేకపోతే అంతే.. వారి పని అయినట్టే అన్న ఆరోపణలున్నాయి. ఇలా అధికారాన్ని అడ్డుపెట్టుకుని కొందరు భూ స్వాహాకు యత్నించడం, బెదిరింపులకు దిగుతుండడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. ఆ పార్టీ పెద్దలు ఇలాంటి వాటిపై దృష్టి సారించి వారిని నియంత్రించే చర్యలు తీసుకోవాలని పలువురు భూ బాధితులు కోరుతున్నారు.

క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకోండి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న పోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారులు ఈ నెల 5వ తేదీ లోపు ప్రశాంతి గ్రామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ గేట్ ఎదురుగా ఉన్న జిల్లా క్రీడల సాధికార సంస్థ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి బి.ఉదయ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 6వ తేదీ హిందూపురంలోని ఎంజిఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల మైదానంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ క్రీడా పోటీలు, పెనుకొండలో పరిటాల రవి డిగ్రీ కళాశాల వెనుక భాగంలోని క్రీడా వికాస కేంద్రంలో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తామన్నారు. 7వ తేదీ హాకీ, బాక్సింగ్, ఆర్చరీ, బాస్కెట్‌బాల్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలను ధర్మవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తామన్నారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు జోనల్, రాష్ట్రస్థాయిలో పాల్గొనేందుకు అవకాశాలు ఉంటాయన్నారు.

చీనీ చెట్లు నరికివేత

చిల్లకొండాయపల్లి ఘటన

నరికివేతకు గురైన చీనీచెట్లు

ప్రజాశక్తి-తాడిమర్రి

మండల పరిధిలోని చిల్లకొండాయ పల్లి గ్రామానికి చెందిన బిల్లే ఈశ్వరయ్యకు చెందిన చీనీచెట్లను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరివేశారు. బాధితుడు తెలిపిన మేరకు వివారలు ఇలా ఉన్నాయి... బిల్లే ఈశ్వరయ్య తనకున్న 2.50 ఎకరాల్లో 300 చీనీ చెట్లు సాగు చేశాడు. ప్రస్తుతం వీటి వయస్సు 7ఏళ్లు ఉంది. ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు 8 చెట్లను నరికివేశారు. సోమవారం సాయంత్రం తోట దగ్గరకు వెళ్లిన రైతు చెట్ల నరికివేతను గుర్తించాడు. బాధితుని ఫిర్యాదు మేరకే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

ఎపిడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిరసనలు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని ఎపిడబ్ల్యూజెఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. జర్నలిస్టుల డిమాండ్స్ డేను పురస్కరించుకుని శ్రీ సత్యసాయి జిల్లాలో ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు కలెక్టర్లను కలిసి వినతిపత్రాలు అందజేశారు. పెనుకొండలో ఆర్డీవో ఆనంద్‌కుమర్, పరిగిలో తహశీల్దార్ హసీనా సుల్తానా, ధర్మవరంలో ఆర్డీవో మహేష్‌లకు వినతిపత్రాలు అందజేశారు. పుట్టపర్తి కలెక్టరేట్లో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు పి.శ్రీనివాసులు, సీనియర్ పాత్రికేయుడు బసయ్య ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల ఇంటిస్థలాల కేటాయింపుతో పాటు జర్నలిస్టులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఇతర సదుపాయాలపై మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. బీహార్ తరహాలో జర్నలిస్టులకు 15వేల పెన్షన్ పథకాన్ని అమలు చేయాలన్నారు. సమాచార శాఖను బలోపేతం దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు.

జాయింట్ కలెక్టర్‌కు అర్జీ ఇస్తున్న ఎపిడబ్ల్యూజెఎఫ్ నాయకులు

కొత్త అక్రిడిటేషన్లను వెంటనే ఇవ్వాలన్నారు. ఈ నెల 6వ తేదీన జరిగే క్యాబినెట్ సమావేశంలో ఈ అంశాలన్నింటినీ చర్చించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు శివకృష్ణ, రవిశంకర్, నాగార్జున, సాయి ప్రసాద్, శివప్ప, రాజు, గంగాధర్, సతీష్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం

పరిటాల శ్రీరామ్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి-బత్తలపల్లి

అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ భరోసా ఇచ్చారు. మండలంలోని అప్రాచెరువు గ్రామంలో సోమవారం నిర్వహించిన 'మీ సమస్య-మాబాధ్యత' కార్యక్రమంలో భాగంగా పరిటాల శ్రీరామ్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇందులో ప్రభుత్వ పథకాలు, ఇళ్లు, ఇళ్ల పట్టాలు, తదితర సమస్యలపై ఎక్కువగా అర్జీలు అందాయి. ఆయన మాట్లాడుతూ సాంకేతిక కారణాలతో అర్హులకు సంక్షేమ పథకాలు అందకపోతే వాటిని పరిష్కరించే బాధ్యత తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ అయ్యప్ప నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పెచ్చులూడిన పాఠశాల పైకప్పు

తప్పిన ప్రమాదం

పెచ్చులూడి కింద పడిన పైకప్పు

ప్రజాశక్తి-రొద్దం

స్థానిక ప్రభుత్వ హైస్కూల్ ల్యాబ్‌లో పైకప్పు పెచ్చులూడి పడ్డాయి. అయితే ఆ సమయంలో ఆ గదిలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. వివరాలు.. రొద్దం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో 15 ఏళ్ల క్రితం నిర్మించిన ల్యాబ్ గది ఉంది. గత ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి ఆ గది పైకప్పు పెచ్చులు ఊడి పడ్డాయి. దీంతో కొద్దిపాటి పరికరాలు దెబ్బతిన్నాయని ప్రధానోపాధ్యాయులు తెలపారు. అయితే ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదన్నారు. అప్పట్లో కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేపట్టడం వల్లే పైకప్పు పెచ్చులు ఊడి పడుతుందని పలువురు పేర్కొంటున్నారు.

డా॥ఆశావాది పురస్కారాలు ప్రదానం

సవ్వప్పగారి ఈరన్నకు సాహిత్య పురస్కారం-డా॥సమ్మెట మాధవరాజుకు అవధాన పురస్కారం

డాక్టర్ సమ్మెట మాధవరాజు దంపతులను అతిథులు

సవప్పగారి ఈరన్నను సన్మానిస్తున్న అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఈ సంవత్సరం పద్మశ్రీ డాక్టర్ ఆశావాది ప్రకాశరావు సాహిత్య పురస్కారం కర్నూలుకు చెందిన 'కవిచంద్ర' సవ్వప్ప గారి ఈరన్నకు, డాక్టర్ ఆశావాది అవధాన పురస్కారం అనంతపురానికి చెందిన అష్టావధాని డాక్టర్ సమ్మెట మాధవరాజుకు అందజేశారు. సోమవారం నాడు హైదరబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వీటిని అందజేశారు. ఆశావాది సాహితీ కుటుంబం ఆధ్వర్యంలో 'అవధానాచార్య' పద్మశ్రీ డాక్టర్ ఆశావాది ప్రకాశరావు 82వ జయంతి వేడుకలు హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో నిర్వహించారు. ఈ సంవత్సరం పద్మశ్రీ ఆశావాది ప్రకాశరావు సాహిత్య పురస్కారం 'కవిచంద్ర' సవ్వప్ప గారి ఈరన్నకు, ఆశావాది అవధాన పురస్కారం అష్టావధాని డాక్టర్ సమ్మెట మాధవరాజుకు అందజేశారు. పద్యప్రబంధ కవి అన్నమరాజు ప్రభాకరరావు సభాధ్యక్షత వహించారు. విజయసారథి, వడ్లూరి ఆంజనేయులు, నండూరి విద్యారణ్య స్వామి అతిథులుగా పాల్గొన్నారు. శతావధాని ఆముదాల మురళి, డాక్టర్ ఆశావాది సుధామ వంశీ, పురస్కార గ్రహీతలను పరిచయం చేశారు. ఉప్పలూరి ఆత్రేయ శర్మ, డాక్టర్ మల్లిపూడి రవిచంద్ర, యెల్చాల నర్సింహులు, ఆశావాది శిరీష వాణి, లక్ష్మీ మానస, శ్రీవల్లి, వసంతగౌరి తదితరులు పాల్గొన్నారు. అష్టావధాని సమ్మెట మాధవరాజు, తెలుగు సేత గావించిన జాంబవతీ పరిణయం పుస్తక పరిచయం కళారత్న ఆముదాల మురళి చేశారు.

ఎన్ఎస్‌పిఆర్ డీగ్రీ కళాశాల విద్యార్థినుల ప్రతిభ

విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

ప్రజాశక్తి-హిందూపురం

ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఎన్ఆర్‌సి(నోడల్ రీసోర్స్ సెంటర్) లెవెల్‌లో వివిధ విభాగాల్లో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ డా॥ఎం.ప్రగతి పేర్కొన్నారు. ఉన్నత విద్యా కమిషనర్ ఆదేశాల మేరకు ఎన్ఆర్‌సి స్థాయిలో అనంతపురం ఆర్ట్స్ కాలేజీలో వ్యాసరచన, వకృత్వ, డిబేట్, క్విజ్ పోటీలు జరిగాయి. రెండు పోటీల్లో ప్రథమ స్థానం, మిగిలిన రెండు పోటీల్లో ద్వితీయ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. డిబెట్ పోటీల్లో బీకాం కంప్యూటర్స్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మదీహా, బీఎస్సీ ప్రథమ సంవత్సరం చదువుతున్న సౌజన్యలు ప్రథమ స్థానం, బీఎస్సీ ప్రథమ సంవత్సరం చదువుతున్న తనూష, నిహారిక, సాయి శ్రీనిధి క్విజ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న నందిని వ్యాసరచన పోటీల్లో ద్వితీయ స్థానం సాధించగా, బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న మదీహ వకృత్వ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించారన్నారు. ఈ నెల 7వ తేదీన కడపలో జరిగే జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. విజేతలను ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, ఎన్ఆర్‌సి కోఆర్డినేటర్, అధ్యాపకులతో పాటు ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డీగ్రీ కళాశాల అధ్యాపకులు డా॥శ్రీధర్, డా॥సరస్వతి, డా॥రవి నాయక్, ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రాం అధికారి ఎస్.రంగనాయకులు, విజేతల తల్లితండ్రులు అభినందించారు.

నూతన కార్యవర్గం ఎంపిక

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని రహమత్ పురంలో ఉన్న అబ్రార్ మసీదు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు మసీదు ముతవల్లి అబ్దుల్ రెహమాన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముతవల్లీగా తనతో పాటు సాని ముతవల్లీగా అస్లాం, సెక్రటరీగా అజ్మతుల్లా, ట్రెజరర్‌గా ఆజాద్ బాషాతో పాటు మరో 9 మంది ఈసీ మెంబర్లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎంపికైన కార్యవర్గం మూడు సంవత్సరాలు కాల వ్యవధి ఉందన్నారు.

ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షులుగా ఎన్.కేశవమూర్తి

కేశవ మూర్తిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-హిందూపురం

పెనుకొండ డివిజన్ ప్రధానోపా ధ్యాయుల సంఘం అధ్యక్షులుగా ఎన్.కేశవ మూర్తి ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. సంఘం జిల్లా ఎన్నికలను శ్రీ సత్య సాయి జిల్లా కొత్తచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ప్రధానోపాధ్యాయుల సంఘం పెనుకొండ డివిజన్ అధ్యక్షులుగా ఎన్.కేశవమూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కేశవ మూర్తి మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుల, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం కేశవ మూర్తిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశులు, వెంకటరమణ, చంద్రశేఖర్, శ్రీనివాసులు, జయశ్రీ, వాణిశ్రీ, పద్మావతి, సవితమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాలపై నిషేధం దుర్మార్గం : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-మడకశిర

ప్రభుత్వ పాఠశాలల్లోకి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసి) ఛైర్మన్, సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు మినహా ఎవరినీ అనుమతించరాదని పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులు విద్యార్థుల స్వేచ్ఛను, ప్రజాస్వామిక హక్కులను హరించడమే ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేష్ మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వెంటనే ఆ సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈరేష్ మాట్లాడుతూ విద్యావ్యవస్థలో వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికి, విద్యారంగ సమస్యలు బయటికి పొక్కకుండా ఉండడానికే ప్రభుత్వం ఇలాంటి సర్క్యులర్ జారీ చేసిందని విమర్శించారు. విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజాస్వామ్యవాదులపై నిషేధం దుర్మార్గమన్నారు. ఈ ఉత్తర్వుల ద్వారా ఇక నుంచి ప్రయివేట్, కార్పొరేట్ సంస్థల వ్యాపారం, అన్యాయాలను బయటకు తీసే అవకాశం లేకుండా పోతుందన్నారు. కావున ప్రభుత్వం వెంటనే ఆ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ముతహిర్, షాహిద్, సాయి, తిమ్మరాజు, దేవా, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఈఓకు సన్మానం

ప్రజశక్తి-రొద్దం

ఎంఈఓ-1గా బాధ్యతలు చేపట్టిన అరవింద్ కుమార్ రొద్దం ప్రభుత్వ హైస్కూల్‌ను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం, వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. ప్రధానోపాధ్యారాలు లక్ష్మినారాయణమ్మ ఎంఈవోను శాలువాతో సన్మానించారు.

ఎంఇఒను సన్మానిస్తున్న ఉధ్యాయులు

సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి

మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్

డివైజ్‌ను అందిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

ప్రజలకు సత్వరమే సేవలు అందించాలన్న ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సాంకేతికతను సద్విని యోగం చేసుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ డి.ఈ.రమేష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో స్వయం సహాయక సంఘాలకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో వేలిముద్రల యంత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలకు సేవలు వేగంగా అందాలనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, శాసన సభ్యులు నందమూరి బాలకష్ణ ఆధునిక సాంకేతికతను అమలు చేస్తున్నారన్నారు. హిందూపురం పురపాలక సంఘంలో 2680 సంఘాలు ఉండగా 81 ఎస్ఎల్ఎఫ్‌లకు 66 మంది ఎస్ఎల్ఎఫ్‌ల నుంచి వచ్చిన డిజి లక్ష్మీ సభ్యులను ఎంపిక చేశారు. ఓపెన్ నెట్ వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్, రుణాల వివరాల లావాదేవీలు అప్పటికి అప్పుడు తీసుకునే నిర్ణయాలకు అనుగుణంగా ప్రభుత్వం అందించిన ఫింగర్ ప్రింట్ డివైజ్‌లు ఉపయోగపడుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా డిఎంసి ఎల్.గంగులయ్య, సిఎస్‌సి మేనేజర్ పాండురంగయ్య, కేశవ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభ్యాసానికి ఇందాద్ ట్రస్ట్ చేయూత

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణానికి చెందిన శిరీష అనే విద్యార్థిని ఇంటర్మీడియట్‌లో 92 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. తల్లిదండ్రులు తమ కుమార్తెకు ఉన్నత చదువు చదివించాలని ప్రయత్నాలు చేస్తుండగా ఆ విద్యార్థిని తండ్రి అనారోగ్యంతో మతి చెందారు. ఓవైపు తండ్రి చనిపోవడం మరోవైపు విద్యకు ఆటంకం ఎదురుగా కావడంతో ఆ కుటుంబం తీవ్రంగా తల్లడిల్లింది. ఈ నేపథ్యంలో హిందూపురం రూరల్ మండల పరిధిలోని ఎల్ఆర్‌జి అకాడమిక్ డైరెక్టర్ ప్రసాద్ సహకారంతో విద్యార్థిని నీట్ పరీక్షకు సంసిద్ధం కావడానికి అవసరమైన పుస్తకాలు తన సొంత డబ్బులతో అందించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇందాద్ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు ఎమ్‌డిఎస్ అమన్, మాజీ విద్యార్థి నాయకుడు అభిలాష్, ట్రస్ట్ కార్యదర్శి ఉమర్ ఫరూక్, ట్రస్ట్ బ్లెడ్ అధ్యక్షులు సాదిక్, కోశాధికారి ఆర్పాద్, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థినికి స్టడీ మెటీరియల్ అందిస్తున్న ఇందాద్ ట్రస్ట్ సభ్యులు

పని చేయని సెల్‌ఫోన్ మాకొద్దు..!

అధికారులకు తిరిగి ఇచ్చేసిన అంగన్వాడీలు

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

అంగన్వాడీ కేంద్రాల్లో 'ఫేస్ రికగ్నైజేషన్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) ను రద్దు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్ డిమాండ్ చేశారు. సెంటర్ నిర్వహణకు ట్యాబ్‌లు ఇవ్వాలని, ఒక్క యాప్ మాత్రమే నిర్వహించాలన్నారు. పెనుకొండ ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం పరిధిలోని అంగన్వాడీ వర్కర్స్ సోమవారం పట్టణంలోని ప్రాజెక్టు కార్యాలయం చేరుకొని పని చేయని మొబైల్స్‌ను ఐసిడిఎస్ అధికారులకు అప్పజెప్పారు. ఈఎస్.వెంకటేష్ మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యోగుల వద్ద ఉన్న 90 శాతం ఫోన్లు చెడిపోయాయి. యాప్‌ల నిర్వహణకు అవసరమైన శిక్షణ ఇవ్వలేదు.. నెట్ స్పీడ్‌గా రావడం లేదు.. చాలా ప్రాంతాల్లో సిగ్నల్ ఉండడం లేదు.. కానీ లబ్ధిదారుల రిజిస్ట్రేషన్, సరుకుల పంపిణీ ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్ ద్వారా జరగాలని అధికారులు పెట్టే ఒత్తిడికి ప్రీస్కూల్ దెబ్బతింటుం దన్నారు. దీంతో భవిష్యత్తులో అంగన్వాడీ సెంటర్‌కే వచ్చే లబ్ధిదారులు, పిల్లలు తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. కావున గతంలో వలే సంతకం పెట్టించుకుని సరుకులు ఇవ్వాలన్నారు. వేతనాలు పెంచా లని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చు, గ్రాట్యుటీ, టిఏ బిల్లులు, హెల్పర్ ఉద్యోగోన్న తులకు గైడ్‌లైన్ రూపొందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ బాబావలి, జిల్లా నాయకులు నాగరాజు, ప్రాజెక్టు లీడర్ బావమ్మ, జయమ్మ, మాబున్నీసా, సావిత్రమ్మ, లక్ష్మీదేవి, మీనా, సరస్వతి, పద్మ, శ్యామల, సునీత, అనూష, అనిత పాల్గొన్నారు.



పురంలో సిడిపిఒకు సెల్ ఫోన్స్ అందిస్తున్న అంగన్వాడీలు

ఓబులదేవచెరువు : మండలంలోని మహమ్మదాబాద్ క్రాస్‌లో ఉన్న ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్స్, మినీ వర్కర్స్ నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ కుళ్లాయప్ప, ప్రాజెక్టు కార్యదర్శి రంగమ్మ, అధ్యక్షురాలు ఆశీర్వాదమ్మ, కోశాధికారి కిష్టమ్మ, సెక్టార్ లీడర్లు మణిమాల, సుజాత, షమీం, వరలక్ష్మి, ఆదిలక్ష్మి, సరళ, స్వర్ణ, తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీ ఉద్యోగులు

చెన్నేకొత్తపల్లి: చెన్నేకొత్తపల్లి ఐసిడిఎస్ కార్యాలయం పరిధిలో ఉన్న అంగన్వాడీ టీచర్స్ సిఐటియు నాయకులు లింగన్న ఆధ్వర్యంలో కార్యాలయానికి చేరుకొని పని చేయని మొబైల్స్‌ను ఐసిడిఎస్ అధికారులకు అప్పజెప్పారు. లింగన్న మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలను ఏకరువు పెట్టారు. కార్యక్రమంలో చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి, రామగిరి అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గుడిబండ : అంగన్వాడీ సెంటర్లకు అందించిన డిపార్ట్మెంట్ ఫోన్‌లు సక్రమంగా పనిచేయడం లేదని వాటిని తీసుకొని వేరే సెల్‌ఫోన్లు ఇవ్వాలని గుడిబండ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో పనిచేస్తున్న

పెనుకొండ నిరసన కార్యక్రమంలో పని చేయని సెల్‌ఫోన్లను చూపుతున్న అంగన్వాడీలు

అంగన్వాడీ కార్యకర్తలు కోరారు. డిపార్ట్మెంట్ ఫోన్లను గుడిబండ ప్రాజెక్ట్ సిడిపిఒ కార్యాలయంలో అందజేసినట్లు అంగన్వాడీ యూనియన్ ప్రతినిధులు మహాదేవమ్మ, నాగమణి తెలిపారు. వారి మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యోగులపై పని భారం తగ్గించాలని కోరారు.

సోమందేపల్లి : పని ఒత్తిడి తగ్గించాలని కోరుతూ సోమందేపల్లిలోని ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. అంగన్వాడీ కార్మికులు మాట్లాడుతూ యూనియన్ సూచనల మేరకు రాష్ట్రవ్యాప్తంగా మొబైల్స్ తిరిగి ఇచ్చేస్తున్నామన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికులకు పని ఒత్తిడి తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు యూనియన్ నాయకురాలు శ్రీదేవి, ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కార్మికులు పాల్గొన్నారు.

హిందూపురం : పనిచేయని సెల్‌ఫోన్ వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఈ విషయాన్ని అంగన్వాడీలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ కనీస స్పందన లేదని, పనిచేయని ఈ సెల్ ఫోన్స్ మాకు వద్దే వద్దు అంటూ సిడిపిఒ వరలక్ష్మికి అంగన్వాడీలు తిరిగి ఇచ్చేశారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపుమేరకు సోమవారం సిడిపిఒ కార్యాలయం వద్ద అంగన్వాడీలు నిరసన తెలిపి, సెల్ ఫోన్స్‌ను తిరిగి ఇచ్చేశారు. సిఐటియు పట్టణ కన్వీనర్ రాము, యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు శోభమ్మ, అరుణ మాట్లాడుతూ వారి సమస్యలను ఏకరువు పెట్టారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శశికళ, విజయలక్ష్మి, శైలమ్మ, శిరీష, నాగమ్మ, వరలక్ష్మి, సునందమ్మ, మీనాక్షి, రజిని, రిహానాబాను, లావణ్య, ధనమ్మ, భాగ్యమ్మ, ఈశ్వరమ్మ, సునీత, పార్వతి, పుణ్యవతి, తులసి, గౌరమ్మ, రూప తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పరిశీలన

ప్రజాశక్తి గోరంట్ల

పట్టణంలోని బస్టాండ్ నుంచి రావికుంటచెరువు కట్ట వరకూ నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డును సోమవారం మంత్రి సవిత పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నిధులు కేటాయించి గ్రామాలు, పట్టణాల్లో రోడ్లను అభివృద్ధి చేస్తుందన్నారు. గోరంట్ల పట్టణంలో రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామన్నారు. అనంతరం మంత్రి పట్టణంలోని 2వ వార్డుకి చెందిన టిడిపి కార్యకర్త, బూత్ కో కన్వీనర్ తలారి రఘు ఆదివారం రాత్రి మృతి చెందిన విషయం తెలుసుకుని రఘు మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆమె వెంట సింగిల్ విండో అధ్యక్షులు చంద్ర, టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి, నాయకులు సోమశేఖర్, అశోక్, ఉమర్‌ఖాన్, రఘునాథ్‌రెడ్డి, నరేష్, ఉత్తమరెడ్డి, శ్రీనివాసులు, వేణు, తిరుపాల్, శ్రీధర్ ఉన్నారు.

సీసీ రోడ్డును పరిశీలిస్తున్న మంత్రి సవిత

మృతి చెందిన కార్మిక కుటుంబాలను ఆదుకోండి

ప్రజాశక్తి-పెనుకొండ

విధులు నిర్వహిస్తూ మృతిచెందిన కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సిఐటి యు ఆధ్వర్యం లో మృతిచెందిన కార్మికుల కుటుంబ సభ్యులతో కలిసి నగర పంచాయతీ మేనేజర్ వెంకటరమణకు వినతి పత్రం ఇచ్చారు. నాయకులు మాట్లాడుతూ మృతి చెందిన కార్మికుల కుటుంబ సభ్యులు 5 నెలలు గా నగర పంచాయతీలో పని చేస్తున్నారన్నారు. అయితే వారికి వేతనాలు అందక కుటుంబ పోషణ భారమైందన్నారు. తక్షణమే వారికి వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని

నగర పంచాయతీ మేనేజర్‌కు వినతి ఇస్తున్న నాయకులు

ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి, సిఐటియు మండల కన్వీనర్ బాబావలి, నాయకులు చిన్న వెంకటేష్, కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం : వైసిపి

ప్రజాశక్తి-మడకశిర

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్దామని వైసిపి మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌళూరు మధుమతి రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప పిలుపునిచ్చారు. వైసిపి ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని మెలవాయి పంచాయతీలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమం చేపట్టారు. వారు ఇంటింటికీ వెళ్లి వైసిపి రూపొందించిన క్యూఆర్ కోడ్ కరపత్రాలను పంపిణీ చేశారు. సిఎం చంద్రబాబు సూపర్‌సిక్స్‌తో పాటు, ఎన్నికల హామీల ను అమలు చేయకుండా మోసం చేస్తున్నారని ప్రజలకు వివరించారు. చంద్రబాబుని నమ్మి ఓటు వేసినందుకు అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు జగన్ పాలనకు, కూటమి పాలనకు తేడాను తెలుసుకొని భవిష్యత్తులో కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆనందరంగారెడ్డి, రంగేగౌడ్, శేషాద్రి, రంగనాథ్, మంజునాథ్, తిప్పేస్వామి, రంగనాథప్ప, రాజశేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

ప్రజాశక్తి-బత్తలపల్లి

మహిళలు ఆర్థికంగా బలోపేతమై కుటుంబ అవసరాలకు తోడుగా నిలవాలని ఆర్‌డిటి మహిళా సాధికార విభాగం డైరెక్టర్ విశాల ఫెర్రర్ సూచించారు. స్థానిక ఆర్‌కె ఫంక్షన్ హాలులో సోమవారం చైతన్య కో-ఆపరేటివ్ బ్యాంక్ ప్రథమ మహాసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విశాల ఫెర్రర్ మాట్లాడుతూ మహిళలు ఏర్పాటు చేసుకున్న చైతన్య సొసైటీ సహకార బ్యాంక్ వచ్చే ఏడాదికి మరింత అభివృద్ధి చెందాలన్నారు. మహి ళలు పొదుపు చేసుకొని కుటుంబ పోషణకు చేయూ తగా నిలవాలన్నారు. ఆర్థిక స్వావలంబన సాధించి నప్పుడే మహిళల ఎదుగుదల కనిపిస్తుంద న్నారు. బ్యాంకు లాభనష్టాలు, బ్యాంకు ఉద్దేశాలు భవిష్యత్ ప్రణాళికపై చర్చించారు. కొత్తగా ఎంపికైన ఐదు గురు బిఒడిలు ప్రమాణస్వీకారం చేశారు. అనం తరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌వైడిటి డైరెక్టర్ నిరంజన్, హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, రీజినల్ డైరెక్టర్ హనుమంతప్ప, ఎటిఎల్ కృష్ణ, ఎస్‌టిఎల్ వెంకటేష్, అంకాల కుమార్, కావేరి, మధుసూదన్, ఫీల్డ్ ఆఫీసర్ కేశవరెడ్డి, కౌన్సిలర్ శోభారాణి, అకౌం టెంట్ వెంకటేష్, సిఒలు రమణప్ప, నాగరాజు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ నారాయణమ్మ, జయలక్ష్మి, లతమ్మ, రాధా, కొండమ్మ, పెద్దులమ్మ, జమ్ములమ్మ, బ్యాంక్ స్టాఫ్ గీతాంజలి, లక్ష్మీదేవి, మంజుల పాల్గొన్నారు.

గంగమ్మ దేవి విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణం మోతుకపల్లిలో సోమవారం గంగమ్మదేవి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా ఆలయంలో మూడు రోజులగా ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నారు. వేద పండితులు అమ్మవారిని వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మున్సిపల్ ఛైర్మన్ డి.ఈ.రమేష్ కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి బాలాజీ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు ప్రెస్ వెంకటేష్, కౌన్సిలర్ సతీష్ కుమార్, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పరిమళ, రాష్ట్ర అంగన్వాడీ కార్యదర్శి వెంకటలక్ష్మి,



విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ప్రముఖులు

లేపాక్షి మండల కన్వీనర్ అభిషేక్, టిడిపి నాయకులు చంద్ర మోహన్ యాదవ్, హరీష్ కుమార్, ఆనంద్, శ్రీనివాసులు, రామిరెడ్డి పాల్గొన్నారు. వైసిపి నాయకులు గుడంపల్లి వేణు రెడ్డి, సువర్ణమ్మ, నాయకులు కురుబ లక్ష్మీనారాయణ, శ్రీనివాస రెడ్డి తదితరులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను అరికట్టాలి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మత్తుపదార్థాలు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రిన్సిపల్ వై.ప్రశాంతి, డాక్టర్ కుళ్లాయప్ప సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో సోమవారం వాటిపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. వారు మాట్లాడుతూ గంజాయి, కొకైన్, హెరా యిన్, నాటుసారా, తదితర మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్పరిణా మాలను వివరించారు. దేశ భవిష్యత్తును కుంగదీసే ఈ మాదక ద్రవ్యాలను పగడ్బందీగా అరికట్టాల్సిన బాధ్యత విద్యార్థులపై కూడా ఉందన్నారు. చట్ట విరుద్ధమైన మందులను వినియోగించ బోమని, డ్రగ్స్ కు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ధర్మవరం ఎక్సైజ్ ఎస్ఐ కె.నాగరాజు, ప్రోగ్రాం ఆఫీసర్ సి.కుళ్లాయిరెడ్డి, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు,

డ్రగ్స్‌పైప అవగాహన కల్పిస్తున్న అధికారులు

క్షయ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి-బుక్కపట్నం

మండలంలోని బుచ్చయ్యగారిపల్లిలో సోమవారం పిహెచ్‌సి సిబ్బంది క్షయ వ్యాధిపై అవగా హన కార్యక్రమం నిర్వహించారు. సిబ్బంది మాట్లాడుతూ క్షయ వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగా హన కలిగి ఉండాలని, ఏమాత్రం నిర్లక్ష్యం వహించరాదన్నారు. క్షయ లక్షణాలు, మందులు, నివారణ మార్గాలు, జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ప్రభాకర్, డిటిసి సూపర్వైజర్ హబీద్ బాషా, ఎఎన్ఎం శిరీష, సుస్మిత, ఆశాలు భారతి, సుధారాణి పాల్గొన్నారు.

తలుపుల : తలుపుల పిహెచ్‌సి

తలుపులలో క్షయపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

పరిధిలోని ఓబుల్‌రెడ్డిపల్లి హెచ్‌డబ్ల్యుసిలో క్షయపై ప్రలకు అవగాహన కల్పించారు. డాక్టర్ ఆఫ్తాబ్ క్షయ లక్షణాలు, మందులు, జాగ్రత్తలు, తదితర విషయాల ను వివరించారు. కార్యక్రమంలో టిబి సూపర్వైజర్ శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పి గీత, ఆరోగ్య కార్యకర్త అరుణ, ఆశాలు మేరీ, రాధా, ప్రజలు పాల్గొన్నారు

పండ్ల మొక్కలు నాటుతున్న ప్రిన్సిపల్, ఎన్ఎస్-ఎస్ విద్యార్థులు

పండ్ల మొక్కలు నాటిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ప్రజాశక్తి-పెనుకొండ

స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో సోమవారం ప్రిన్సిపల్ డా. జెవి వి ఎన్.కేశవరావు ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పండ్ల మొక్కలు నాటారు. శ్రీసత్యసాయి సేవా సమితి పెనుకొండ శాఖ సభ్యులు మామిడి, పనస పండ్ల మొక్కలు అందించారు. ప్రిన్సిపల్ మాట్లాడు తూ పండ్ల మొక్కలు నాటడం ద్వారా పక్షులు, వివిధ రకాల జంతువులకు ఆహారం లభించే అవకాశం ఉందన్నారు. వైస్ ప్రిన్సిపల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కె.జయప్ప మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యత తీసుకొని పర్యావ రణ సమతుల్యతలో భాగం కావాలని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు సూచించారు. కార్యక్రమంలో హరిప్రసాద్, అధ్యాపకులు కాంతారావు, సీనియర్ అసిస్టెంట్ రామాంజనేయులు, అటెండర్లు కదిరప్ప, చెన్నకేశవులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదుల వెల్లువ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదుల సంఖ్య వారం వారం పెరిగిపోతూనే ఉంది. ఈ వారం మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ ఆదినారాయణ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ సెల్ నిర్వహించగా 75 ఫిర్యాదులు అందాయి. అందులో కుటుంబ కలహా లు, భూ సమస్యలు, సైబర్ మోసాలు, ఆస్తి పంపకాలు, తదితర వాటిపై ఎక్కు వగా ఫిర్యాదులు అందాయి. చట్ట పరిధిలో ఉన్న ఫిర్యాదులపై విచారణ జరిపి తక్షణమే పరిష్కారం చూపాలని డీఎస్పీ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

7న ఉచిత క్యాన్సర్ నిర్ధారణ కార్యక్రమం

పుట్టపర్తి అర్బన్ : స్థానిక సత్యసాయి పాలియేటివ్ కేర్ సెంటర్‌లో ఈ నెల 7వ తేదీ ఉచిత క్యాన్సర్ నిర్ధారణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సత్యసాయి అనుగ్రహ గృహం వృద్ధాశ్రమం వెనక ఉన్న కార్యాలయంలో ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 080 47103700లో సంప్రదించాలన్నారు.

ప్రపంచ వాణిజ్య దినోత్సవంపై అవగాహన

ప్రజాశక్తి-బుక్కపట్నం

ప్రపంచ వాణిజ్య దినోత్సవం పురస్కరించుకొని సోమవారం స్థానిక సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ వాణిజ్య దినోత్సవంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ మక్బూల్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచంలో వాణిజ్యానికి ఉన్న ప్రాముఖ్యత, వాణిజ్యంలో ఉన్న సదుపాయాలు, మెలకువల గురించి అవగాహన కల్పించారు. వాణిజ్యంలోని ఎగుమతులు, దిగుమ తులపై ఆర్థిక వ్యవస్థ ఏ విధంగా ఆధారపడింది అనే విషయాన్ని వివరించారు. విద్యార్థులు వాణిజ్యాపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజ్ మహమ్మద్, శ్రీనివాసులు, ఓబులేసు, నాగేంద్ర, ఆనంద్, వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నియంత్రణపై సదస్సు

ప్రజాశక్తి-రొద్దం

స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఐ నరేంద్ర మాట్లాడుతూ బాల్య వివాహం చేయడం నేరమన్నారు. ఎవరైనా బాల్య వివాహం చేసినా, ప్రోత్సహించినా, హాజరైనా శిక్షార్హులవుతారన్నారు. బాల్య వివా హం గురించి తెలిస్తే పోలీసులకు సమాచారం ఇస్తే అడ్డుకుంటారని తెలిపారు. అలాగే విద్యార్థులు డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సదస్సులో హెచ్ఎం లక్ష్మినారాయణమ్మ, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నరేంద్ర

నేడు యర్రాయపల్లిలో 'మీ సమస్య-మా బాధ్యత'

బత్తలపల్లి : మండలంలోని యర్రాయపల్లి గ్రామంలో మంగళవారం టిడిపి ఆధ్వర్యంలో 'మీ సమస్య-మా బాధ్యత' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు చల్లా శ్రీనివాసులు తెలిపారు. బత్తలపల్లిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో యర్రాయపల్లిలో ప్రజల సమస్యలపై అర్జీలు స్వీకరిస్తారన్నారు.

తహశీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రాజశేఖర్‌బాబు

కాలువ ఆక్రమణలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని సర్వే నెంబర్-311లో కాలువ కట్టను సర్వే చేయించి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజశేఖర్‌బాబు తహశీల్దార్ మురళీకృష్ణకు వినతిపత్రం అందజే శారు. ఆయన మాట్లాడుతూ కదిరి పట్టణంలో పలు చోట్ల ప్రభుత్వ భూములను ఆక్రమించారని, చెరువు కాలువ కట్టలు సైతం ఆక్రమణకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. ఇకనైనా ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని, రియల్ ఎస్టేట్ వ్యాపారుల దురాక్రమణలను ఆపాలని విన్నవించారు.

నేడు మడకశిరలో 'చంద్రన్న సుఖీభవ'

ప్రజాశక్తి-గుడిబండ

మడకశిరలో ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యం లో మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే 'చంద్రన్న సుఖీభవ' కార్యక్రమానికి మండల వ్యాప్తంగా ట్రాక్టర్లతో ర్యాలీగా వెళ్లి విజయవంతం చేయాలని సింగిల్‌విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప, టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప కోరారు. వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా వంద ట్రాక్టర్లకు తగ్గకుండా మడకశిరకు తరలి వెళ్లాలని పిలుపునిచ్చారు.

ఎంపిడిఒకు సమస్యలు వివరిస్తున్న ఉపాధి కూలీలు

'ఉపాధి' కూలీల నిరసన

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని గౌరిగానిపల్లి గ్రామా నికి చెందిన ఉపాధి హామీ కూలీలు సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. కూలీలు మాట్లాడుతూ ఉపాధి హామీ కింద ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు తవ్వామని, వాటికి 5 నెలలైనా బిల్లులు మంజూరు కాలేదన్నారు. స్పందించిన ఎంపిడిఒ నరసింహమూర్తి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఇంకుడు గుంతలకు సంబంధించి బిల్లులు పెట్టాం.. త్వరలోనే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని హామీ ఇచ్చారు.

క్రికెట్ టర్ఫ్ వికెట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

క్రికెట్ టర్ఫ్ వికెట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కదిరి టౌన్

యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సూచించారు. పట్టణంలోని మదనపల్లి రోడ్డులో చైతన్య స్కూల్ వెనుక వైపున ఏర్పాటు చేసిన ఐసిసి క్రికెట్ టర్ఫ్ వికెట్‌ను సోమవారం ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత ఇతర వ్యాపకాల వైపు వెళ్లకుండా ఈ క్రికెట్ టర్ఫ్ వికెట్‌ను సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అనిల్ కుమార్‌రెడ్డి, సిఎ ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

'మంగళకర'లో ఘనంగా కామర్స్ డే

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

దేశం అభివృద్ధిని శాసించే స్థాయికి కామర్స్ విభాగం చేరిందని, నేటి తరానికి కామర్స్ ఎంతో ఉపయోగకరమని ఎస్‌కె యూనివర్సిటీ పరీక్షల సంచాలకులు వెంకటరమణ పేర్కొన్నారు. మండలం లోని జగరాజుపల్లి మంగళకర విద్యాసంస్థలో సోమవారం కామర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటరమణ కామర్స్ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ఉపాధి రంగం, జాతీయ ఆదాయ అభివృద్ధిలో కామర్స్ పాత్ర ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో మంగళకర విద్యాసంస్థల మేనేజింగ్ ట్రస్ట్ సురేష్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ట్రస్ట్ ఆర్య ప్రకాష్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రమేష్ బాబు, బుక్కపట్నం డిగ్రీ కళాశాల కామర్స్ అధ్యాపకులు ఓబులేష్, మంగళకర విద్యాసంస్థల ఏవో జయచంద్రారెడ్డి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు జ్ఞాపిక అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

రేషన్ షాపుల్లో అవకతవకలను అరికట్టండి

ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతి

ప్రజాశక్తి-తనకల్లు

రేషన్‌షాపుల్లో తూకాల్లో అవకతవకలను అరికట్టాలని ఎపి రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో పలు సమస్యలపై తహశీల్దార్ సయ్యద్‌షాబుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి కుటుంబంలో హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ చేపట్టాలని కోరారు. వేరుశనగకు ప్రత్యామ్నాయంగా ఉలవలు, పెసలు, అలసందలు, ఆముదాలు, తదితర విత్తనాలు వెంటనే పంపిణీ చేయాలని కోరారు. కొక్కంటి క్రాస్‌లో చౌక ధాన్యపు డిపో-17లో తూకాల్లో అవకతవకలకు పాల్పడుతు న్నారని, చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయ కులు వివి.రమణ, శివన్న, ఎస్‌వి.రమణ, వి.శ్రీనివాసులు, రమణ, తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎపి రైతు సంఘం నాయకులు

ఉనికి కోసమే వైసిపి చౌకబారు విమర్శలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

రాజకీయ ఉనికి కోసమే వైసిపి చౌకబారు విమర్శలు చేస్తుందని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఓ మహిళా ఎమ్మెల్యేను సభ్య సమాజం తలదించుకునేలా నీచంగా మాట్లాడిన వైసిపి మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డిని జగన్ పరామర్శించడం, అతడిని పక్కన కూర్చోబెట్టుకుని ప్రభుత్వంపై నిందలు వేయడం దుర్మార్గమని మండిపడ్డారు. జగన్ నెల్లూరు టూర్ ప్లాప్ కావడంతో గ్రాఫిక్స్‌తో జనాన్ని చూపించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇకనైనా విలువలతో కూడిన రాజకీయం చేయాలని జగన్‌కు, వైసిపి నాయకులకు సూచించారు. లేనిచో భవిష్యత్తులో వైసిపి కనుమరగవడం ఖాయం అన్నారు.

విద్యార్థులకు ఐడీ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని పాలసముద్రం గ్రామ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఎంఇఒ జాన్ రెడ్డప్ప ఆధ్వర్యంలో 85 మంది విద్యార్థులకు ఐడి కార్డులు పంపిణీ చేశారు. హెచ్ఎం నీలం అశోక్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థి నరేష్ సొంత ఖర్చుతో విద్యార్థులకు ఐడి కార్డులు సమకూర్చాడన్నారు. ఎంఇఒ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయు లు జయచంద్ర నాయక్, నాగలీల, సంప్రీతాబాయి, సునంద, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపిక

కొత్తచెరువు : రాష్ట్రస్థాయి జూడో పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారని జిల్లా జనరల్ సెక్రటరీ భాస్కర్‌నాయుడు తెలిపారు. ఈ నెల 9, 10తేదీల్లో మంగళగిరిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి 16 మంది క్రీడాకారులు ఎంపికయ్యారన్నారు. ఇందులో 8 మంది బాలురు, 8 మంది బాలికలు పాల్గొంటారన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారిని జాతీయస్థాయికి ఎంపిక చేస్తార న్నారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

హిందూపురం : స్థానిక రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని గుడ్డం రైల్వేగేట్ సమీపంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. వివరాలు.. రైల్వే స్టేషన్ సమీపంలోని ఎంజె ఉన్నత పాఠశాల క్రీడా మైదానం పక్కన రైల్వే ట్రాక్‌పై ఒక పురుషుడి మృతదేహం పడి ఉన్నట్లు రైల్వే కీ మెన్ సమాచారమిచ్చారన్నారు. సంఘటన స్థలాన్ని పరిశీలించగా మతునికి సంబంధించి ఎలాంటి ఆనవాళ్లు లభ్యం కాలేదన్నారు. మతుడికి సుమారు 50 సంవత్సరాల వయస్సు ఉంటుందని, వ్యక్తి రైలు కిందపడి చనిపోయినాడని తెలిపారు. మతుడు నలుపు రంగుతో 5. 5 అడుగుల ఎత్తు ఉండగా తెల్లటి వెంట్రుకలు, సాధారణ శరీరం, ఆకుపచ్చ, ఎరుపు నిలువగీత ఫుల్ షర్టు, తెలుపు కట్ బనియన్, స్కాప్ కలర్ ప్యాంటు, బ్లూ కలర్ డ్రాయర్ ధరించి ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసులకు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మతుడి వివరాలు తెలిసిన వ్యక్తులు హిందూపురం రైల్వే పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని సూచించారు.

పేకాట జూదరులు అరెస్ట్..

బుక్కపట్నం : మండలంలోని మదిరేబయలు, రెడ్డిపల్లి గ్రామ సమీపంలో సోమవారం పోలీసులు పేకాట స్థావరాలపై దాడి చేసి 11 మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ. 2.05 లక్షల నగదు స్వాధీ నం చేసుకున్నట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి కడప జిల్లాకు చెందిన 11 మంది పేకాట జూదరులను అరెస్ట్ చేశామన్నారు.

కాంట్రాక్టర్‌కు బెదిరింపులు.. కేసు నమోదు

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

పంచాయతీరాజ్ నిధులతో ఇరగంపల్లి నుంచి తలమర్లకు తారు రోడ్డు వేస్తున్న ఓ కాంట్రాక్టర్‌ను బెదిరించిన వారిపై కేసు నమోదు చేసినట్లు సిఐ మారుతి శంకర్ తెలిపారు. మండ లంలోని ఇరగంపల్లి గ్రామానికి చెందిన అంకె రామంజి, కుంపటి శివలింగం అనంతపురం జిల్లా లోని కంబదూరు గ్రామానికి చెందిన వరలక్ష్మి, కోగిర శివకుమార్‌తో కలిసి కాంట్రాక్టర్ ఎం.రమణారెడ్డిని బెదిరించి పనులను అడ్డుకున్నట్లు సదరు కాంట్రా క్టర్ ఫిర్యాదు చేయడంతో కొత్తచెరువు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.